క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం బర్హాన్‌పురంలోని సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9నుంచి 10:30 గంటల వరకు సరఫరాకు అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. దీంతో బుర్హాన్‌పురం, బస్ డిపో ప్రాంతాల వినియోగదారులు గమనించాలని సూచించారు.

నేడు, రేపు న్యాక్ బృందం పరిశీలన

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 24, 25వ తేదీల్లో న్యాక్ బృందం పరిశీలించనుందని ప్రిన్సిపాల్ జి.పద్మావతి తెలిపారు. 1965లో ప్రారంభమైన కళాశాలలో 59 ఏళ్లుగా వేలాది మంది విద్యార్థినులు చదువుకున్నారని, 2018లో న్యాక్ 'ఏ'గ్రేడ్ సాధించగా, మూడో సారి గ్రేడింగ్‌కు వెళ్తున్నామని వెల్లడించారు. కళాశాలకు విశాలమైన ఆటస్థలం, 20వేలకు పైగా పుస్తకాలతో గ్రంథాలయం, సెమినార్ హాల్, ప్రయోగశాలలు, ఇంక్యూబేషన్ సెంటర్, ఆడిటోరియం, ప్లాంట్, కంప్యూటర్ లాబ్‌లే కాక అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నందున మెరుగైన గ్రేడ్ లభిస్తుందనే ఆశాభావం ఉందని తెలిపారు.

బిల్లులు తగ్గింపుపై కాంట్రాక్టర్ల గగ్గోలు

ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపల్ కార్పొరేషన్‌లో మెయింటెనెన్స్ పనులు, ఇతర పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో అధికారులు కోతలు విధిస్తున్నారని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. టెండర్లు వేసి, పనులు చేసే వరకు అన్నింటికి సరే చెబుతున్న అధికారులు బిల్లుల చెల్లింపుల్లో మాత్రం కోతలు పెడుతూ తమకు నష్టం కలిగిస్తున్నారని, ఇలా అయితే కేఎంసీలో పనులు చేయించలేమని పేర్కొంటున్నారు. బిల్లుల్లో కోత పెట్టడంపై కాంట్రాక్టర్లు మేయర్‌కు చెప్పినట్లు తెలిసింది.

బియ్యం వితరణ

ఖమ్మంఅర్బన్: నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్ అనాథాశ్రమానికి రోటరీ నగర్‌కు చెందిన వాసవీ క్లబ్ సభ్యుడు కేసా సత్యం బుధవారం పది క్వింటాళ్ల బియ్యం అందజేశారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావుతో పాటు నాగుల్ మీరా, సోమశేషగిరిరావు, కల్వకుంట్ల హన్మంతరావు, తల్లాడ వినోద్‌కుమార్, కొదుమూరి శ్రీనివాసరావు, కొత్తూరి రమేష్, పాలవాయి వెంకటేశ్వరరావు, యర్ర బవసయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల దాతృత్వం


మొరంతో చదును చేస్తున్న దోజర్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు దాతృత్వం చూపించారు. పాఠశాల ఆవరణలో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచి బురదమయంగా మారడంతో తేజావత్ మణికంఠ, సమత అనే విద్యార్థుల తల్లిదండ్రులు మురళీ, అరుణలు మొరం తోలించి చదును చేయించారు.ఈమేరకు మొరం తోలించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ప్రోత్సహించిన ఉపాధ్యాయురాలు జ్యోతిని పాఠశాల హెచ్‌ఎం మంజుల అభినందించారు.

రోడ్ల వెంట చెత్త వేసిన వారికి జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: రోడ్ల వెంట వ్యర్థాలు వేస్తున్న వారికి కేఎంసీ అధికారులు జరిమానా విధించారు. 25వ డివిజన్‌కు చెందిన పానిపూరీ బండ్ల నిర్వాహకులు ఇద్దరికి రూ.వెయ్యి చొప్పున, 14వ డివిజన్‌లో ప్లాస్టిక్ వస్తువులు కాలుస్తున్న వారికి రూ.1,500 జరిమానా విధించినట్లు తెలిపారు. వ్యర్థాలను కేఎంసీ చెత్త సేకరణ వాహనాలకు అందించాలే తప్ప రోడ్ల వెంట వేయొద్దని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా జనరల్ ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో కృషి చేయనున్నట్లు ఆయన తనయుడు యుగంధర్ తెలిపారు. ఆస్పత్రిలో బుధవారం పరిశీలించిన ఆయన సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, వైద్యులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నాయకులు మహ్మద్ ఆఫ్రిఫ్, నాళం సతీష్, యలనాటి కోటేశ్వరరావు, నల్లమోతు లక్ష్మయ్య, అల్లెసాయి కిరణ్, బొమ్మ ఉదయ్, బెల్లంకొండ వాసు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దేవర
వినోద	జనక అయితే గనక
సాయిరాం	విశ్వం
ఆదిత్య	రాధేకృష్ణ
శ్రీనివాస	వేట్టయన్: ద హంటర్
సినీ గెలాక్సీ	ఇద్దరు

- ఖమ్మంగాంధీచౌక్

బాగుపడేదెన్నడో?



తూతూ మంత్రంగానే రోడ్డు ప్యాచ్‌వర్క్‌లు

- కొత్త బస్టాండ్ పక్కన మళ్లీ గుంతలు
- శాశ్వత పరిష్కారం చూపని అధికారులు
- పనుల్లో నాణ్యత లేక తరచూ గుంతలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు


బస్టాండ్ అవుట్ గేట్ రోడ్డులో నాణ్యత లేకుండా వేసిన ప్యాచ్‌వర్క్ (ఇన్‌సెట్) గుంతలమయంగా మారిన రోడ్డు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. పలు ప్రాంతాల్లో రోడ్లపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా ఉంటున్నాయి. ప్రధానంగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న కొత్తబస్టాండ్ ప్రాంతాల్లో రోడ్లు నాణ్యత లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంటుంది. వీటికి ప్యాచ్‌వర్క్‌లు సక్రమంగా చేయకపోవడంతో గుంతలు ఏర్పడుతున్నాయి.

తరచూ గుంతలు..

ఎన్‌ఎస్‌పీ క్యాంపులో కొత్త బస్టాండ్ నిర్మించిన తర్వాత బస్టాండ్ అవుట్‌గేట్ వైపు సీసీ రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో రహదారి అంతా గుంతలమయంగా మారుతుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పదే పదే మరమ్మతులకు గురవుతున్నా.. శాశ్వత పరిష్కారం చూపించేందుకు అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

కొత్తగా రోడ్డు నిర్మిస్తేనే..

నూతన బస్టాండ్ అవుట్‌గేట్ రోడ్డు మరమ్మతులకు గురైన ప్రతీసారి ప్యాచ్‌వర్క్‌లు చేయించి చేతులుదులుపుకుంటున్న అధికారులు శాశ్వత పరిష్కారం చూపించడం లేదు. ఈ రోడ్డు నిర్మాణం సమయంలో సరైన పద్ధతి పాటించకుండా పాతది అలానే ఉంచి రెండు వైపుల కొత్తగా రోడ్డు నిర్మాణం చేశారని, దీంతో జాయింట్లు కలవక కొత్తగా వేసిన రోడ్డు పాడవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ రోడ్డు అంతా తవ్వి కొత్తగా పూర్తి స్థాయి రోడ్డు నిర్మిస్తేనే శాశ్వత పరిష్కారం దొరుకుతుందని చెబుతున్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు పట్టించుకుని తనగి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గ్రామాల్లో ట్రెయినీ అధికారుల పర్యటన


పండితాపురం సంతలో మాట్లాడుతున్న ట్రెయినీ అధికారుల బృందం

కామేపల్లి: మండలంలోని జగన్నాథతండా, కొమ్మినేపల్లి, బాసిత్‌నగర్ గ్రామాల్లో బుధవారం ట్రెయినీ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించారు. కొమ్మినేపల్లి జీపీలోని పండితాపురం పశువుల వారంతపు సంతను సందర్శించి అందులో జీవాలు, పశువులు, కూరగాయలకు సంబంధించిన క్రయవిక్రయాలు, సంత ద్వారా రైతులు, జీపీకి కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొమ్మినేపల్లి జీపీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డుల నమోదుతో పాటు జీపీ సిబ్బంది రోజువారి పనిచేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. బాసిత్‌నగర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి గ్రామాల్లో రోగులకు అందిస్తున్న ప్రభుత్వ వైద్య సేవలను పరిశీలించారు. బ్యాంకులు అందిస్తున్న రుణాలతో మహిళలు ఏ విధంగా ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతుందో తెలుసుకున్నారు. ఈ బృందంలో మనీశ్ మీనా, సులేఖ జాగర్వాల్, అరుశ్‌సెల్వన్, నీలేశ్‌శ్రీకాంత్‌గైక్వాడ్, మధివధాని, మండల అధికారులు ఈజీఎస్ ఏపీఓ శ్రీరాణి, ఏపీఎం సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

'కేఎండీసీ' అథ్లెట్ల ప్రతిభ


అథ్లెట్లను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల ఏపీలోని గుంటూరులో జరిగిన దక్షిణ భారత జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కోట అప్పిరెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో కళాశాలకు చెందిన ఎం.గోపిచంద్, ఎస్.కె.ఆఫ్రీన్‌లు ప్రతిభ కనబరిచి రజత, కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. ఈమేరకు బుధవారం కళాశాలలో కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ.రమణరావు, పీడీ జె.ఉపేందర్‌లు అథ్లెట్లను అభినందించారు.

లక్ష్మీపురం కార్యదర్శిగా భారతి

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న భారతికి బదిలీపై గతంలో పని చేసిన వైరా మండలం స్నానాల లక్ష్మీపురానికి మళ్లీ బదిలీ అయ్యారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా గ్రామ కార్యదర్శులను బదిలీలు చేయగా.. లక్ష్మీపురం నుంచి చిమ్మపూడి వచ్చారు. అక్కడి ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఆమెను తిరిగి లక్ష్మీపురం బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిమ్మపూడి గ్రామ పంచాయతీకి ఎవరినీ కేటాయించలేదు. ఈ మేరకు చిమ్మపూడిలో భారతి తన విధుల నుంచి బుధవారం ఎంపీడీఓ అశోక్ రిలీవ్ చేశారు.

జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలులో ఈ నెల 27న నిర్వహించే మండల మహాసభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకులు షేక్ బషీరుద్దీన్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ మూడేళ్లకోసారి జరిగే ఈ మహాసభలు గ్రామం నుంచి ఆల్ ఇండియా దాకా జరుగుతాయన్నారు. ఈ మహాసభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరై గత మూడేళ్లుగా పార్టీ కార్యక్రమాలను చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలు తీసుకుంటారని తెలియజేశారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి శ్రీను, నాయకులు అంగిరేకుల నరసయ్య, పద్మనాభుల సుధాకర్, తుళ్లూరు నాగేశ్వరరావు, వేగినాటి వెంకట్రావు, కొలిచలం స్వామి, కోట ఉపేందర్‌రెడ్డి, శ్రీదేవి, వీరన్న, దిండు మంగపతి తదితరులు పాల్గొన్నారు.

మహాసభ విజయవంతానికి ప్రచారం

రఘునాథపాలెం: ఈనెల 25న జరగనున్న ధర్మయుద్ధ మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఈమేరకు బుధవారం మండలంలోని వేపకుంట్ల, వి.వెంకటాయపాలెంల్లో ప్రచారం చేయగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గాజుల నర్సింహారావు, ఇన్‌చార్జ్ మంద గోపాల్‌రావు మాట్లాడారు. ఖమ్మం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో జరిగే సభకు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరుకానుండగా నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. నాయకులు నేలాల నాగేశ్వరావు, నేలాల గురవయ్య, నేలల నాగరాజు, పాక రాకేష్, పాక నవీన్, నేలాల బాలస్వామి, వంకాయల పుల్లయ్య, నాలాల ప్రకాశం, తగరం ఆదాము, తగరం సత్యనారాయణ, కన్నెగంటి హరీష్, తగరం కొండలరావు, వెంకటేశ్వర్లు, పండు, శీను పాల్గొన్నారు.

మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభం

ఖమ్మంమయూరిసెంటర్: మెప్మా ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌లను మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం ప్రారంభించారు. ఈనేపథ్యాన ఖమ్మంఅర్బన్, ఖమ్మంరూరల్ తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో ఎంఐ క్యాంటీన్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శ్రీ కనకదుర్గ క్యాంటీన్‌ను ఏర్పాటు చేయగా.. వాటిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ, ప్రజలకు ఆరోగ్యకరమైన భోజనం అందిస్తూ.. మహిళలు ఆర్థికంగా ఎదగాలని మేయర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పసుమర్తి రామ్మోహన్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ షఫీఉల్లా, ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, మెప్మా డీఎంసీ సుజాత, టీఎంసీ సుజాత, సీఓలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ విస్తృత పర్యటన


కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 36వ, 37వ డివిజన్లలో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం పర్యవేక్షించారు. డివిజన్లలో పర్యటిస్తూ చెత్త సేకరణను పరిశీలించారు. రైల్వే ట్రాక్ మూడో లైన్ నిర్మాణ పనులు, ట్రాక్ విస్తరణకు సేకరించిన భూమిని పరిశీలించారు. ట్రాక్‌ల కింద నుంచి డ్రెయినేజీ వాటర్ వెళ్లేలా లింక్ డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టారా లేదా అని చూసి వర్షపు నీరు నిల్వకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో డ్రెయినేజీలను విస్తరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ షఫీఉల్లా, ఈఈ కృష్ణాలాల్ తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ గ్రౌండ్ పరిశీలన..

దీపావళి పండుగ సందర్భంగా ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేయనున్న టపాసుల దుకాణాల స్థలాన్ని కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. ప్రతీ దుకాణానికి ట్రేడ్ లైసెన్స్ ఉండేలా చూడాలని, ప్రణాళిక ప్రకారం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సీటీ స్కానింగ్ సేవలు పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్ సేవలు తిరిగి పునరుద్ధరించబడ్డాయి. వారం క్రితం ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సీటీ స్కాన్ గదికి సరఫరా చేసే కేబుళ్లలో సమస్య ఏర్పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వారం రోజులుగా రోగులకు స్కానింగ్ సేవలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఈ నెల 18న సాక్షిలో ''స్కానింగ్ ఆగిపాయే''అనే కథనం ప్రచురితం కాగా.. అధికారులు స్పందించారు. ఇంజనీరింగ్ సిబ్బందిని పిలిపించగా.. వారి సూచనల మేరకు కొత్త కేబుల్స్ కోసం ఆస్పత్రి అత్యవసర నిధుల నుంచి రూ. 2లక్షలు వెచ్చించి బుధవారం సాయంత్రం సేవలు పునరుద్ధరించారు. దీంతో స్కానింగ్ సేవలు యథాతథంగా కొనసాగాయి.

అలా వచ్చారు.. ఇలా వెళ్లారు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ఓ కిరాణం షాపులో భారీగా నూనెలు నిల్వ చేశారని, అనుమతి లేకుండా లూజ్ నూనె విక్రయిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం జిల్లా ఆహార తనిఖీ అధికారి ఆర్.కిరణ్‌కుమార్ దుకాణంలో తనిఖీ చేశారు. ఫిర్యాదులో పేర్కొన్నట్లుగా నిల్వలు లేవని వెల్లడించిన వెళ్లిపోయారు. అయితే, ఫిర్యాదుదారులతో మాట్లాడుకోవాలని సదరు వ్యాపారికి సలహా ఇచ్చినట్లు తెలుస్తుండగా స్థానికులు మండిపడ్డారు. ఈ విషయమై అధికారిని వివరణ కోరగా తమ తనిఖీల్లో ఎలాంటి నిల్వలు లేనట్లు తేలిందని, తాము వ్యాపారికి సలహా ఇచ్చినట్లు జరుగుతున్న ప్రచారంలోవాస్తవం లేదని తెలిపారు.

'ఇందిరమ్మ' స్థలాల పరిశీలన


చింతపల్లిలో సర్వే చేస్తున్న తహసీల్దార్

ఖమ్మంరూరల్: మండలంలోని చింతపల్లిలో పేదలకు ఇవ్వనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రభుత్వ స్థలాలను బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు రూరల్ తహసీల్దార్ బి.రాంప్రసాద్ పరిశీలించారు. ఈ స్థలాన్ని మండల సర్వేయర్‌తో సర్వే చేయించి అనువైన గుర్తించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

నగర సమస్యలపై దృష్టి సారించాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర సమస్యలపై అధికారులు దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ డిమాండ్ చేశారు. బుధవారం పాత పీఆర్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన 44వ డివిజన్ సీపీఎం శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. బస్సు డిపో రోడ్డును 100 అడుగులు రోడ్డుగా విస్తరించాలని, వైరా రోడ్డు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి సరితా క్లినిక్ సెంటర్ వరకు ఎన్‌ఎస్‌టీ రోడ్డును 80 అడుగుల రహదారిగా విస్తరణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమైన ఆస్పత్రులు ఉండడంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. అంతర్గత రోడ్లు గుంతల మయంగా ఉన్నాయని, వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. లేకుంటే సీపీఎం ఆధ్వర్యాన దశల వారీగా ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు హుస్సేన్, డి.నాగరాజు, షుఖర్, మల్లికార్జున్ రెడ్డి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా అధికారుల నిర్లక్ష్యం..

- ఆర్పీ చేతిలో మోసపోయిన బాధితులు కేఎంసీకి క్యూ
- న్యాయం చేయాలంటూ వినతులు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళలకు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేని రూ.10 వేల సాయం బ్యాంకుల ద్వారా ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసిన ఆర్పీపై పూర్తి విచారణ చేయడంలో మెప్మా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆర్పీ తమను మోసం చేసిందని గత నెల కొంతమంది బాధితులు కేఎంసీ కార్యాలయానికి వచ్చి ఆందోళన చేయగా.. అధికారులు విచారణకు ఆదేశించారు. అయితే ఆ ఆర్పీ వెనుక ఎవరు ఉన్నారు..? ఇంకా ఎంత మంది బాధితులు ఉన్నారనే అంశాలు తేల్చకుండా మెప్మా అధికారులు తూతూమంత్రంగా విచారణ చేసి, ఆర్పీని విధుల నుంచి తొలగిస్తున్నట్లు వెల్లడించారు. అయినా తమను కూడా వహిద అనే ఆర్పీ మోసం చేసిందని బుధవారం బాధితులు కేఎంసీ కార్యాలయానికి వచ్చారు. ఎస్‌కె ఫర్హీన్, ఎస్‌కె తబసుం అనే మహిళా బాధితులు తమకు రూ.10 వేలు నగదు ఇప్పిస్తామని చెప్పిన ఆర్పీ తమ పేరుపై రూ.2 లక్షల రుణం మంజూరు చేయించిందని, ఆ రుణం ఏమైందో తమకు తెలియదని వాపోయారు. తమకు న్యాయం చేయాలంటూ అధికారులను కలిసేందుకు వచ్చారు.

అధికారుల తీరుపై అనుమానాలు..

రుణాల పేరుతో బ్యాంకర్లను, మహిళా సభ్యులను మోసం చేసిన ఆర్పీపై పూర్తి స్థాయి విచారణ జరిపి మహిళలకు న్యాయం చేయడంలో మెప్మా అధికారులు అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. సీఓలు, ఆ పై అధికారుల పాత్ర కూడా ఈ రుణాల మంజూరులో ఉందనే అనుమానాలను మహిళలు వ్యక్తం చేస్తున్నారు. పూర్తి విచారణ జరిపితే ఎక్కడ తాము చేసే అవినీతి బయటకు వస్తుందోనని విచారణ కూడా జరిపించలేదనే చర్చ జరుగుతోంది. కమీషన్లకు అలవాటు పడిన మెప్మా అధికారులు, సిబ్బంది బాధితులకు న్యాయం చేయడంలేదని కేఎంకి వచ్చిన మహిళలు బహిరంగంగా ఆరోపణలు చేశారు. దీనిపై మెప్మా అధికారులను వివరణ కోరగా.. ఆర్పీని ప్రశ్నించామని, మహిళలు చెప్పింది విన్నామని, ఆర్పీని బాధ్యులుగా చేసి విధుల నుంచి తొలగించామని తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం


సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ ఫణీందర్‌శర్మ

ఖమ్మంవన్‌టౌన్: ఇంటర్నెట్ వినియోగం పెరిగిన నేపథ్యాన సైబర్ మోసాల బారిన పడకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్ సెల్ డీఎస్పీ ఫణీందర్ శర్మ సూచించారు. స్కోప్ ఆర్డీ ఆధ్వర్యాన చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో ఖమ్మంలోని సాహితీ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనవసరమైన లింక్‌లను తెరవొద్దని, అనుమానాస్పద మెసేజ్‌లకు స్పందించొద్దని సూచించారు. కాగా, ఆన్‌లైన్ మోసాల బారిన పడితే 1930నంబర్‌కు, బాలలకు సమస్యలు తలెత్తితే 1098 చైల్డ్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని డీఎస్పీ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ నిమ్మకాయల తిరుపతయ్య, ఎస్సై రంజిత్‌తో పాటు నర్సింహారావు, యశోద, కె.సుజాత, ఐశ్వర్య, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకన్న పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు బానిస కావొద్దు

కూసుమంచి: సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్‌ను సమూలంగా నిర్మూలించేందుకు విద్యార్థులు కృషి చేయాలని ఎస్సై నాగరాజు సూచించారు. బుధవారం కూసుమంచిలోని జలగం వెంగళరావు జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ భవిష్యత్‌ను తామే నిర్ణయించుకోవాలని, చెడు అలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవొద్దని హితవు పలికారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు సేవించడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, ఇందుకు పాల్పడినవారికి కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం విద్యార్థులు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్‌రెడ్డి, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భూసేకరణ నిలిపివేయాలని వినతి


డీఈకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కూసుమంచి: శ్రీరామ్ సాగర్ రెండోదశ పెండింగ్ కాల్వల తవ్వకం కోసం అధికారులు భూసేకరణ సర్వే చేపట్టగా.. రైతులు ఆందోళన నిర్వహించిన సంఘటన బుధవారం చౌటపల్లిలో చోటుచేసుకుంది. మండలంలోని చౌటపల్లితో పాటు తిరుమలాయపాలెం మండలం బీరోలు, బంధంపల్లి గ్రామాల్లో శ్రీరామ్‌సాగర్ కాల్వల తవ్వకం కోసం భూమిని సేకరించాల్సి ఉండడంతో సంబంధిత అధికారులు సర్వే కోసం రాగా ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. ఈక్రమంలో తమ భూములను కాల్వ తవ్వకం కింద తీసుకోవద్దని భూసేకరణ విభాగం డీఈ సంజీవ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం భక్తరామదాసు ప్రాజెక్టుతో సాగునీరు అందుతుందని, మళ్లీ కాల్వలు తవ్వాల్సిన అవసరం లేదని రైతులు డీఈకి వివరించి తమ భూములు ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. దీంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఈ చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

శతాధిక వృద్ధురాలి మృతి


రాజమ్మ(ఫైల్)

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు గుండపనేని రాజమ్మ (100) బుధవారం మృతి చెందింది. ఈమేరకు ఆమె మృతదేహాన్ని పలువురు పరామర్శించి నివాళులర్పించారు. మృతురాలికి నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రిటైర్డ్ ఆర్‌టీఏ అధికారి మృతి

నేలకొండపల్లి: అఖిల భారత యాదవ మహాసభ నాయకుడు, రిటైర్డ్ ఆర్‌టీఏ అధికారి చంద్రకాని గోవిందరావు మృతి బుధవారం మృతి చెందారు. ఈమేరకు మండలంలోని బైరవునిపల్లిలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యాదవ యువజన సంఘం అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి యాదవ్, బైరవునిపల్లి గొర్రెల, మేకల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడు మల్లెబోయిన ఉపేందర్, నాయకులు ఎస్‌కె. ఫతే మహమ్మద్, శ్రీనివాస్, రమేష్, మధు, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం గ్రామంలో బుధవారం భారతీయ జనతా పార్టీ ఓబీసీ విభాగం ఆధ్వర్యాన చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఓబీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి జక్కుల రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ బూత్ నుంచి 200 సభ్యత్వాలను నమోదు చేయాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, జ్వాలా నర్సింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖ సత్యనారాయణ, మండల అధ్యక్షులు సోమనపల్లి వెంకన్న, దుర్గయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

కామేపల్లి: మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన తండ్రీ, కుమార్తె చింతల లింగస్వామి, చింతల కావేరి పిడుగుపాటుకు గురై మృతి చెందగా బుధవారం వారి మృతదేహాలపై ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చి మృతుల కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండి అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, గోపీరెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వర్గీకరణ చేసే వరకూ నోటిఫికేషన్లు ఇవ్వొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న చింతబాబు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వొద్దని, తక్షణమే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతబాబు మాదిగ, జాతీయ ఉపాధ్యక్షుడు లంక వెంకటేశ్వర్లు, ఎల్‌ఆర్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం అంబేడ్కర్‌భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని ప్రకటించి కమిటీల పేరుతో కాలయాపన చేన్నారని ఆరోపించారు. నవంబర్ 3న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు మేళ్లచెరువు నాగమణి, కొత్తపల్లి నరసింహ, భద్రయ్య, కుర్రి నర్సింహ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగాపోరాటం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం బుధవారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో మాట్లాడారు. నవంబర్‌లో జరుగే మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కామాప్రభాకర్, నాగేంద్రబాబు, నవీన్ బాబు, గొట్టిముక్కల శ్రీనివాస్, నరసింహారావు, వీరుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.